## క్లుప్తంగా

### ఆవాజ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆవాజ్ కమిటీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆవాజ్ కమిటీ రూపొందించిన నూతన సంవత్సరం– 2025 క్యాలెండర్‌ను ఆ సంఘం నగర కమిటీ నాయకులు ఇస్మాయిల్, పి.ఇక్బాల్‌హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్‌లు ఆవిష్కరించారు. శుక్రవారం నగరంలోని సంఘం కార్యాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించి ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లింల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు.

### దోమలను నియంత్రించాలి


నిల్వ నీటిని పరిశీలిస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): దోమల పెరుగుదలను నియంత్రించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని డెమో శ్రీనివాసులు కోరారు. శుక్రవారం శరీన్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని విఠల్ నగర్‌లో జరుగుతున్న ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలోని ప్రాంతాలను సందర్శించి, ప్రజల ఇళ్లలో నిల్వ నీటిని పూర్తిగా తొలగించి, మళ్లీ పట్టుకునేలా కృషి చేయాలన్నారు. ఆ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, అలాగే నీటి నిల్వలు గల ప్రాంతాలను గుర్తించినట్లయితే ఆ వివరాలను వెక్టార్ కంట్రోల్ హైజిన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి, సంబంధిత సచివాలయ సెక్రటరీ ద్వారా సమస్య పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, సచివాలయ ఆరోగ్య కార్యకర్త రేణుక తదితరులు ఉన్నారు.

### నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖలో చేపట్టనున్న అభివృద్ధి పనులలో భాగంగా నగరంలోని పవర్ సెక్షన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఈఈ శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్ఆర్ పేట, సంకల్‌బాగ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఫార్మసిస్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు (హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖ జోన్–4 పరిధిలో 15 ఫార్మసిస్టు ఉద్యోగాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ బి.రామగిడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసే ఈ ఉద్యోగాలకు దరఖాస్తు నమూనా, ఇతర వివరాలు http://cfw.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసిన దరఖాస్తు, సర్టిఫికెట్లను జతపరచి ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు వైఎస్సార్ జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకుల కార్యాలయంలో అందజేయాలన్నారు.

### 7, 8న యువతకు పోటీలు

కర్నూలు (హాస్పిటల్): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈనెల 7, 8 తేదీల్లో జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వం, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారిణి పి.దీప్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. 15 – 29 సంవత్సరాల్లోపు యువత పోటీల్లో పాల్గొనాలని కోరారు. 7న ఉదయం 9:30 గంటలకు వ్యాసరచన (అంశం: స్వామి వివేకానంద జీవిత సందేశం), వక్తృత్వం (అంశం: డ్రగ్ వ్యసనం–దాని ప్రభావాలు), 8వ తేదీన ఉదయం 9:30 గంటలకు డిబేట్ (అంశం: సోషల్ మీడియాలో విద్వేషపూరిత ప్రసంగాలను నిరోధించవచ్చా), విద్యార్థులు తమ విద్యాపరమైన విషయాలను మరియు పౌరులుగా వారి బాధ్యతలను ఎలా సమతుల్యం చేసుకోవచ్చు, సమాజ నిర్మాణంలో యువత పాత్ర, క్విజ్ పోటీలు (ఆన్‌లైన్) అంశం : వివేకానంద జీవనశైలి, ఆయన బోధనలు) ఉంటాయన్నారు. పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఆసక్తి గలవారు నేరుగా సెయింట్ జోసెఫ్ కళాశాలకు పోటీలు జరిగే రోజున హాజరుకావాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే క్విజ్ పోటీలకు వెబ్ లింక్ https://forms.gle/MQMTcVjPBtbG3BfK8 ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలు కానివారు నేరుగా హాజరుకావచ్చన్నారు.

# శివారు కాలనీలకు సంచార రైతుబజార్

- రైతుబజార్ మొబైల్ వాహనానికి పచ్చ జెండా ఊపి ప్రారంభించిన జేసీ నవ్య
- విజయవంతమైతే మరిన్ని వాహనాలు


సంచార రైతుబజారు వాహనాన్ని ప్రారంభిస్తున్న జేసీ నవ్య, చిత్రంలో మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగర శివారుల్లో కొత్తగా వెలసిన కాలనీవాసుల సౌకర్యార్థం ప్రత్యేక సంచార రైతుబజారు వాహనాలను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ నవ్య తెలిపారు. సంచార రైతుబజారు విజయవంతమైతే రానున్న రోజుల్లో మరిన్ని వాహనాలను అందుబాటులోకి తెచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం సి.క్యాంపు రైతుబజారు వద్ద ఏర్పాటైన కార్యక్రమానికి జేసీ ముఖ్య అతిథిగా హాజరై పచ్చ జెండా ఊపి మొబైల్ రైతుబజారు వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. పట్టణానికి అన్ని వైపులా కొత్త కాలనీలు అనేకం అభివృద్ధి చెందాయని, ఆ కాలనీవాసులు కూరగాయల కోసం కర్నూలుకు రావాల్సి వస్తోందన్నారు. కొత్త కాలనీల వారి సౌకర్యార్థం మొబైల్ రైతుబజారును అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. సంచార రైతుబజారు వాహనం నగరానికి 10 కిలోమీటర్ల పరిధిలో రోజూ ఉదయం ఒక కాలనీ, సాయంత్రం మరొక కాలనీకి వెళ్లి కూరగాయలను విక్రయిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని శివారు కాలనీల వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణ మూర్తి మాట్లాడుతూ.. మొబైల్ రైతుబజారు సి.క్యాంపు రైతుబజారు ఎస్టేటు ఆఫీసర్ ఆధ్వర్యంలో పని చేస్తుందని, తాజా కూరగాయలు, ఆకు కూరలన్నీ ఇందులో లభిస్తాయని తెలిపారు. రైతుబజారు ధరలకే కూరగాయలు లభిస్తాయన్నారు. ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్, కొత్తపేట రైతుబజారు ఎస్టేటు అధికారి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

### కళా రంగ సేవ ప్రశంసనీయం

కర్నూలు కల్చరల్: నాటకం, టీవీ, సినిమా రంగాల్లో దాదాపు 60 సంవత్సరాలు సేవలు అందించిన సుబ్బరాయ శర్మ కృషి ప్రశంసనీయమని రాజ్య సభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. హైదరాబాద్ మహతి క్రియేషన్స్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న సాంఘిక నాటకోత్సవాలు శుక్రవారం ముగిశాయి. పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారన్నారు. అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, సుబ్బరాయ శర్మ మాట్లాడారు.. కళారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న డాక్టర్ రవికృష్ణను ఘనంగా సన్మానించారు. అనారోగ్యం బారిన పడిన నంది అవార్డు గ్రహీత శామ్యూల్‌కు రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం ప్రదర్శించిన ఉక్కు సంకెళ్లు నాటిక ప్రేక్షకులను అలరించింది. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సినీ నటుడు గోపరాజు రమణ, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, ఉపాధ్యక్షులు సీవీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అదిగదిగో ఆర్థిక భవనం!


రూ.16.50 కోట్లతో నిర్మించిన ఆర్థిక భవనం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీ కార్యాలయం నూతన భవనంలోకి మారుతోంది. ఆర్థిక శాఖకు సంబంధించిన జిల్లా ట్రెజరీ, స్టేట్ ఆడిట్, ఏపీజీఎల్ఐ, పేఅండ్ అకౌంట్స్ కార్యాలయాలన్ని ఒకే భవన సముదాయంలో ఉండే విధంగా కర్నూలులోని బీ.క్యాంపులో రూ.16.50 కోట్లతో 7000 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ+3 ఆర్థిక భవనాన్ని నిర్మించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఆర్థిక భవనాన్ని అపార్టుమెంట్ తరహాలో నిర్మించింది. ఈ భవన నిర్మాణానికి 2024 మార్చిలో అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రత్యేక భవనం ఉన్నప్పటికీ ట్రెజరీ కలెక్టరేట్‌లోనూ, స్టేట్ ఆడిట్ కార్యాలయం సంక్షేమభవన్‌లో కొనసాగుతుండగా.. ఏపీజీఎల్ఐ, పే అండ్ అకౌంట్స్ కార్యాలయాలు అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. పెండింగ్ పనులు పూర్తి కావడంతో కలెక్టరేట్‌లో ఉన్న ట్రెజరీ కార్యాలయాన్ని వెంటనే బీ.క్యాంపులో నిర్మించిన ఆర్థిక భవనంలోకి సిఫ్ట్ చేయాలని ఇటీవల జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. దీంతో ట్రెజరీ అధికారులు కొత్త భవనంలోకి వెళ్లడానికి రెండు, మూడు రోజులుగా కంప్యూటర్లు, సామగ్రి తరలిస్తున్నారు. కంప్యూటర్లను అమర్చే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శనివారం ఆర్థిక భవనాన్ని ప్రారంభించి, అక్కడే నుంచే కార్యకలాపాలు మొదలు పెట్టేందుకు ట్రెజరీ అధికారులు నిర్ణయించారు. స్టేట్ ఆడిట్, ఏపీజీఎల్ఐ, పే అండ్ అకౌంట్స్ కార్యాలయాలను ఎప్పటికి తరలిస్తారనే విషయంపై స్పష్టత లేదు.

# నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు


నేత్రదానం అంగీకార పత్రాన్ని అందజేస్తున్న నాగలింగారెడ్డి కుటుంబ సభ్యులు

కర్నూలు కల్చరల్: మానవత సంస్థ సహకారంతో ఇప్పటివరకు నలుగురిచే నేత్రదానం చేయించడంతో ఎనిమిది మందికి కంటి చూపు లభించిందని సంస్థ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ యుగంధర్ శెట్టి చెప్పారు. శుక్రవారం స్థానిక వీఆర్ కాలనీలో నాగలింగా రెడ్డి (85) మృతి చెందడంతో నేత్రాలు దానం చేసేందుకు ఆయన కుమార్తెలు డాక్టర్ సీహెచ్ లత, ఆర్అండ్‌బీ డీఈ సుజాత, కుమారుడు సీహెచ్ శ్రీనివాసరెడ్డి అంగీకరించారు. వెంటనే రెడ్‌క్రాస్ సంస్థ వారికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి రెండు నేత్రాలనుసేకరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ గోవింద రెడ్డి, సంస్థ కన్వీనర్ మనోహర్ రెడ్డి నేత్రదానం ఆవశ్యకతను వివరించారు. సంస్థ అధ్యక్షుడు శోభన్ బాబు, ఉపాధ్యక్షులు తిరుపతి సాయి తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానంతో మరొకరికి ప్రాణదానం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న డాక్టర్ కేజీ గోవిందరెడ్డి తదితరులు

కర్నూలు(హాస్పిటల్): రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి అన్నారు. భారత్ పెట్రోలియం లిమిటెడ్ రీజనల్ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ సిబ్బందిచే శుక్రవారం ఆ ప్లాంట్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. బీపీఎల్ ఎల్‌పీజీ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ రీజనల్ కార్యాలయం, బాలసాయి కంటి ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ప్రారంభించిన ఈ శిబిరాన్ని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దాత బరువు కనీసం 50 కిలోలు కలిగి ఉండి 12 గ్రాముల పైబడిన హిమోగ్లోబిన్ ఉన్న 18 నుంచి 60 ఏళ్లలోపు వారు ఎవ్వరైనా రక్తదానానికి అర్హులని తెలిపారు. లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ మాజీ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్త గ్రూపును తెలియజేసే ఐడీని తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో దాని ఆవశ్యత ఉంటుందన్నారు. కంటి వైద్యులు జయప్రకాష్, ఎల్‌పీజీ టెరిటరీ మేనేజర్ తుషార్ జగతాప, ఆపరేటర్స్ మేనేజర్లు అరుణ్‌కుమార్, లతీఫ్, సేల్స్ ఆఫీసర్ బి.సురేష్, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, రెడ్‌క్రాస్ అధికారి వెంకటసుబ్బారెడ్డి, డాక్టర్ రంగనాయకులు, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### 10 నుంచి పీస్ కాన్ఫరెన్స్

కర్నూలు కల్చరల్: టీజీవీ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ప్రథమ వార్షికోత్సవం, నృత్య జ్యోతి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ 25వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఈనెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కర్నూలులో నిర్వహించనున్న సౌత్ ఏషియా పీస్ కాన్ఫరెన్స్ కార్యక్రమ పోస్టర్లను శుక్రవారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆవిష్కరించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని పీస్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్వాహకుడు భార్గవ కుమార్ మాట్లాడుతూ.. మాంటిస్సోరి విద్యాసంస్థల సహకారంతో ఇండస్ పాఠశాలలో నిర్వహించే కాన్ఫరెన్స్‌కు 20 రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కళాకారులతో పాటు విదేశాలకు చెందిన కళాకారులు పాల్గొంటారన్నారు.

### రేపు మాజీ సైనికుల సంక్షేమ సంఘం సమావేశం

కర్నూలు (అర్బన్): ఈనెల 5వ తేదీన మంగళగిరిలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి సమావేశం జరగనుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నర్రా పేరయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. ఒకే రాష్ట్రం, ఒకే అధ్యక్షుడు అనే నినాదంతో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని ఆలూరు, ఆదోని, డోన్, కోవెలకుంట్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ, నంద్యాల, ఆత్మకూరు,నందికొట్కూరు, కర్నూలు ప్రాంతాల నుంచి అధ్యక్షులు హాజరవుతారని వెల్లడించారు.

# నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


నిరాహార దీక్షలను ప్రారంభిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

కర్నూలు(సెంట్రల్): నగరంలో ఇల్లు లేని పేదలందరికీ ఇంటి స్థలం ఇవ్వాలని, ఆ స్థలాల్లో ప్రభుత్వమే ఉచితంగా గృహాలను నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ధర్నా చౌక్‌లో సీపీఐ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షతన చేపట్టిన దీక్షలను ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు.. పట్టణాల్లో ఇళ్లులేని వారికి రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని వారికి మూడు సెంట్ల స్థలాన్ని ఇవ్వాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. ఇళ్ల పట్టాల పొందిన వారికి రూ.5 లక్షలు వెచ్చించి గృహాన్ని నిర్మించి ఇవ్వాలన్నారు. మరో వైపు కర్నూలు నగరంలో నీటి ఎద్దడి లేకుండా రెండో ఎస్ఎస్ ట్యాంకును నిర్మించాలన్నారు. నగరంలో అండర్ డ్రెయినేజీ వ్యవస్థను చేపట్టాలని, హంద్రీ వాగుకు ప్రహరీ గోడలు నిర్మించాలని డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి పేదలపై భారం పడకుండా చూడాలన్నారు. సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులు జి.చంద్రశేఖర్, డి.శ్రీనివాసరావు, నాయకులు గిడ్డమ్మ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కులాల వాదనలు వినిపించేందుకు సహకారం


సాంఘిక సంక్షేమ శాఖ డీడీ తులసీదేవిని సన్మానిస్తున్న మాల సంఘాల జేఏసీ నేతలు

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డు కులాల్లోని ఉప వర్గీకరణకు సంబంధించి రిటైర్డు ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఆధ్వర్యంలోని ఏకసభ్య కమిషన్ ఈ నెల 2వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో అన్ని కులాలకు తమ వాదనలు వినిపించేందుకు జిల్లా అధికార యంత్రాగం పూర్తి స్వేచ్ఛ కల్పించిందని మాల సంఘాల జేఏసీ నేతలు అన్నారు. సమావేశం ఆద్యంతం ఎవరు ఇబ్బందులకు గురి కాకుండా ఏర్పాట్లు చేసిన సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.తులసీదేవిని శుక్రవారం మాల సంఘాల జేఏసీ చైర్మన్ కాసారపు వెంకటేష్, రాయలసీమ జిల్లాల అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకూరి అశోకరత్నం తదితరులు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. అధికారుల సహకారం వల్ల కార్యాక్రమానికి హాజరైన వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారందరూ తమ వినతులను కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారన్నారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు రాజకుమార్, నాయకులు మహేష్‌కుమార్, మాల నాగేంద్ర, పి.రాజీవ్‌కుమార్, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం


క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, తదితరులు

కర్నూలు (అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయ అధికారి పి.ఎల్.వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం 2025 టేబుల్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవిప్రకాష్‌రావు, ఎం.సి.కాశన్న మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను డీఏఓ దృష్టికి తెచ్చారు. ఆత్మ డీపీడీ శ్రీలత, ఏడీఏలు సాలురెడ్డి, ఈరేష్, అన్నపూర్ణ, అరుణకుమారి, ఏఓలు శారదమ్మ, అనురాధరెడ్డి, ఉషారాణి, రాఘవేంద్ర, అల్లిపీర, అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**విశ్రాంత ఉద్యోగుల సంఘం డైరీ విడుదల....**
ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ సమస్యలు, ఇతర ఆర్థికపరమైన సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం అబ్బాస్ నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కర్నూలు శాఖ అధ్యక్షుడు రంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సంఘానికి చెందిన 2025 డైరీని డీడీతో పాటు కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ ఏటీఓ రఘువీర్, ఎస్‌టీఓ విక్రాంత్‌తో కలసి విడుదల చేశారు.

### నైపుణ్య శిక్షణా తరగతులు

కర్నూలు న్యూసిటీ: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని మహిళా సాధికార కేంద్రంలో ప్రభుత్వ నైపుణ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో సూయింగ్ మిషన్ ఆపరేటర్ (45 రోజులు), జనరల్ డ్యూటీ అసిస్టెంట్ ట్రైనీ (60 రోజులు) ఉచిత శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రాంగణ మేనేజర్ అంజలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న 18 నుంచి 35 సంవత్సరాలలోపు మహిళలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.


కర్నూలు రైల్వే స్టేషన్‌ను శుభ్రం చేసేందుకు వచ్చిన ఆర్‌యూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో వీసీ ఎన్‌టీకే నాయక్

### రైల్వేస్టేషన్ శుభ్రం

కర్నూలు కల్చరల్: యువత సామాజిక బాధ్యత కలిగి ఉండాలని రాయలసీమ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. వన్ డే మాసివ్ క్లీనింగ్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ ప్లేసెస్‌లో భాగంగా వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌లో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. వీసీ, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు పరిశుభ్రత ప్రాధాన్యతపై మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పి.నాగరాజు, కర్నూలు రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం.శేషఫణి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, రైల్వే ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్, ఎస్ఐ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఫైనాన్స్ కంపెనీ ఆగడాలను అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్): గృహాలను తాకట్టు పెట్టుకొని రుణాలు ఇచ్చే ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ కంపెనీ ఆగడాల నుంచి రక్షణ కల్పించాలని ఏపీ మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు శ్రావణి, కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏపీ మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏదైనా మాసంలో ఒక్కోసారి ఫైనాన్స్ కంతు కట్టడానికి వీలుకాకపోతుందన్నారు. అలాంటి సమయంలో కంపెనీ ఉద్యోగులను ఇళ్లకు పంపి డబ్బు కట్టాలని నిలదీస్తుండటంతో కుటుంబాల మర్యాదలు ఏమి కావాలని ప్రశ్నించారు. వీరి ఆగడాలను ఎదుర్కోలేక ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అయినా ఫైనాన్స్ కంపెనీల తీరు మార్పు రావడంలేదన్నారు. వెంటనే ఫైవ్‌స్టార్ కంపెనీ ఆగడాలను నిలువరించాలన్నారు. లేదంటే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు దిగుతామని స్పష్టం చేశారు. నాయకులు భారతి, పావని, రేణుక, శైలజ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### కార్టూన్ కార్నివాల్ సందడి


ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

కర్నూలు సిటీ: స్థానిక కృష్ణానగర్‌లోని సర్వేపల్లి విద్యాసంస్థల్లో కార్టూన్ కార్నివాల్ షోను శుక్రవారం నిర్వహించారు. స్కూల్ చైర్మెన్ పి.శేషన్న, డైరెక్టర్ పి.దీక్షిత్, ప్రధానోపాధ్యాయురాలు కె.పి అరుణశ్రీ పాల్గొన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలకు మాత్రమే పరిమితం కాకుండా మరింత జ్ఞానాన్ని, ఆలోచన విధానాన్ని పెంపొందించేందుకు కార్టూన్స్ షో లాంటి కార్యక్రమాలు చక్కగా ఉపయోగ పడతాయన్నారు. ఆ షోలోని క్యారెక్టర్స్ తామే పోషిస్తే ఎలా ఉంటుందో పిల్లలు చేసి చూపించారన్నారు. షోలో డోరమాన్, చోటభీమ్, స్పైడర్‌మ్యాన్, సిండరేల్లా, ఘోస్ట్, బార్బిడాల్, న్యూస్ పేపర్, డిటెక్టివ్, వాటర్‌డ్రాప్, ప్యారెట్స్, హనిబీ, సన్‌ఫ్లవర్, సన్, యూట్యూబ్, సెల్‌ఫోన్, ప్రిన్సెస్, క్విన్, ఐస్‌క్రీమ్స్, బటర్‌ఫ్లై, చాకోబార్ వేషాలతో చిన్నారులు అలరించారు. ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను వారు అభినందించారు.





కర్నూలు(అర్బన్): సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, బీసీ నేతలు

### సావిత్రిబాయి పూలేకు ఘననివాళి


కర్నూలు సిటీ: కేవీఆర్ కాలేజీలో నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్,తదితరులు

# హిప్నాటిజంతో మానసిక ఒత్తిడికి చెక్


డాక్టర్ సిరిగిరెడ్డి జయారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): హిప్నాటిజం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గుతుందని ప్రముఖ క్లినికల్ హిప్నోథెరపిస్ట్ డాక్టర్ సిరిగిరెడ్డి జయరెడ్డి చెప్పారు. ప్రపంచ హిప్నోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అనేక మంది డాక్టర్లు, సైంటిస్టులు ప్రాక్టికల్ పరిశోధనల వల్ల 1955లో బ్రిటిష్ కౌన్సిల్ లీగల్‌గా, శాస్త్రపరంగా, వైద్యపరంగా, విద్యాపరంగా హిప్నోసిస్ అర్హత సాధించిందన్నారు. అలాగే 1958లో అమెరికా మెడికల్ అసోసియేషన్ గుర్తింపు కూడా ఇచ్చిందన్నారు. మానసిక వైద్య పితామహుడు డాక్టర్ సిగ్మాండ్ ఫ్రెడ్ ప్రముఖ సైకాలజిస్టు, హిప్నోథెరపిస్ట్ డాక్టర్ మిల్టన్ ఎరిక్‌సన్ హిప్నోథెరపీని అభివృద్ధి చేసి రోగులకు, విద్యార్థులకు మంచి ఫలితాలు సాధించారన్నారు. 1945లో డాక్టర్ జేమ్స్. ఎస్.డెయిల్ మన దేశంలో కొన్ని వందల శస్త్రచికిత్సలు అనస్తీషియా లేకుండా హిప్నోసిస్ ద్వారా చేశారన్నారు. విద్యా సమస్యలు, మానసిక, సైకో సమస్యలకు హిప్నోథెరపీ ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చి బాగు చేయవచ్చన్నారు.